## క్లుప్తంగా

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం 8.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

### సిద్ధేశ్వర కాలనీలో చోరీ



బీరువా తాళాలు పెకలించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సిద్ధేశ్వర కాలనీలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కుటుంబ సభ్యులంతా పీర్ల ఉత్సవానికి వెళ్లివచ్చేలోగా దొంగతనం జరిగింది. టైలరింగ్, మగ్గం వృత్తితో జీవనం సాగిస్తున్న రమేష్ ఇంట్లో తులం విలువ చేసే బంగారు ఆభరణాలతోపాటు రూ.15 వేలు నగదు దోచుకెళ్లారు. ఉచ్చబాయి పీర్ల దర్శనానికి తెల్లవారుజామున 4 గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. తాళం పగలగొట్టి ఇంట్లో ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు పెకలించి అందులో ఉన్న బంగారు కమ్మలు, మాటీలు, నగదు చోరీ చేశారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు. ఇదిలా ఉండగా ఇదే ఏరియాలోని బైలాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న హుండీ చోరీ జరిగింది. పోలీసులు స్పందించి చోరీలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కంపచెట్లు తొలగించండి



పీఏబీఆర్ రోడ్డుకిరువైపులా అడ్డంగా పెరిగిన చెట్లు

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ డ్యాంకు వెళ్లే రోడ్డుకు జల్లిపల్లి, హంసాయపల్లి, డ్యాం వరకూ కంప చెట్లు అడ్డంగా పెరిగాయి. పలు చోట్ల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. కణేకల్లు మండలం నుంచి ప్రజలు అనంతపురానికి ఈ డ్యాం రోడ్డు మీదుగా వాహనాల్లో అధికంగా వెళ్తుంటారు. అలాగే ఉరవకొండ మండలం కొకుంట్ల, రాకెట్ల గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణం సాగిస్తుంటారు. డ్యాంలో నీరు ఎక్కువగా ఉండడంతో పర్యాటకుల తాకిడి భారీగా ఉంటోంది. అక్కడ పని చేసే అధికారులు రోజూ వాహనాల్లో ఈ మార్గం మీదుగానే వెళుతారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగింపజేసి, ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.


### కొరవడిన పర్యవేక్షణ



మండల విద్యాధికారి కార్యాలయం

కూడేరు: 2022–23 విద్యా సంవత్సరంలో మండలవ్యాప్తంగా 336 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 122 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా విద్యా బోధన జరిగేలా చర్యలు చేపట్టింది. కానీ మండల విద్యాశాఖ అధికారులు తరగతులు ప్రారంభించినప్పటి నుంచి పిల్లలకు అందుతున్న విద్యా బోధన, పిల్లల స్టడీపై పర్యవేక్షణ చేయకపోవడంతోనే ఉత్తీర్ణత తగ్గిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాధికారి పాఠశాలల్లో జరిగే సన్మానాలు, ఇతర ఫంక్షన్లకు మాత్రమే (ఇతర పాఠశాలల ఉపాధ్యాయలును వెంటబెట్టుకుని) హాజరవుతారని, ఆ సమయంలోనే విజిట్ చేసినట్లు చెప్పుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాధికారులు పర్యవేక్షణ చేసి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### యువకుడి మృతి



మృతి చెందిన గోపాల్

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్‌కు చెందిన హెచ్.మారెక్క కుమారుడు హెచ్.గోపాల్ (30) కుటుంబ కలహాలతో ఈనెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడినిబళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ఊరేగిస్తున్న పీర్లు, హాజరైన జన సందోహం



కంబదూరు: పీర్లను దర్శించుకుంటున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయదుర్గంటౌన్: మహిమాన్విత ఉచ్చుభాయ్ పీర్ల సవారీలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



రాయదుర్గంటౌన్: వాల్మీకి నగర్‌లో పులి వేషధారణ



రాయదుర్గం రూరల్: జుంజురాంపల్లిలో అగ్ని గుండప్రవేశం చేస్తున్న పీర్లు



బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో అగ్నిగుండం చుట్టూ తిరుగుతున్న పీర్లు

# భక్తిశ్రద్ధలతో మొహర్రం

సాక్షి నెట్‌వర్క్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా మొహర్రం పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా చెప్పుకునే ఈ పండుగను హిందూముస్లింలు కలసికట్టుగా భక్తి,శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే పీర్ల చావిడీల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవం తొలి దర్శనానికి ఎగబడ్డారు. బెల్లం, చక్కెర చదివింపులు చేపట్టారు. పూల హారాలు, వెండి ఛత్రీలు తొడిగి మొక్కుతీర్చారు. అనంతరం పీర్లతో అగ్ని గుండ ప్రవేశం చేశారు. జలధికి తరలించే ముందు గ్రామ, పట్టణపుర వీధుల్లో మేళ, తాళాలు, తప్పెట్ల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. రాయదుర్గం పట్టణంలోని కోట ఏరియాలో జరిగిన పీర్ల సవారీ(ఊరేగింపు)కి భక్తులు పోటెత్తారు. సాయంత్రం పట్టణంలోని పీర్లను పూలమాలలు, వస్త్రాలతో అలంకరించి ఊరువాకిలి వద్ద ఊరేగించారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి గుడి ఏరియాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పులి వేష ప్రదర్శన ఆకట్టుకుంది. కెంచె కొండె రాఘవేంద్ర ఆధ్వర్యంలో దాదాపు తొమ్మిది మంది కళాకారులు పెద్ద పులి వేషంతోపాటు ఎడంబీ ప్రదర్శన అదుర్స్ అనిపించింది. రాయదుర్గం మండలంలోని కెంచానపల్లి, నాగిరెడ్డిపల్లి, కొండాపురం , గ్రామదట్ల , జుంజురాంపల్లి, ఆర్బీ వంక, ఆవులదట్ల, చదం, పల్లేపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం చివరి రోజు(ఆదివారం) పీర్లను ఊరేగించి జలధికి తరలించారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, లింగదహాళ్, దర్గాహొన్నూరు, కల్‌హోళ, కానాపురం, కొత్తూరు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ముగిశాయి. కళ్యాణదుర్గం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం చివరి రోజు ఆదివారం సాయంత్రం పీర్ల స్వాముల జలధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



కూడేరు: పీర్ల దేవుళ్లను జలధికి తీసుకెళుతున్న దృశ్యం



బెళుగుప్ప: జలధికి తరలుతున్న పీర్లను దర్శనం చేసుకుంటున్న భక్తులు

#### పూజల్లో మంత్రి ఉషశ్రీచరణ్

మత సామరస్యానికి, ఐకమత్యానికి ప్రతీక మొహర్రం అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంత్రి శనివారం రాత్రి కంబదూరు మండలంలోని మర్రిమాకులపల్లి, గుద్దెళ్ల గ్రామాల్లో జరిగిన మొహర్రం వేడుకల్లో పాల్గొని పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. అలాగే కూడేరు మండలంలోని కలగళ్ల, కూడేరు, ఇప్పేరు జల్లిపల్లి, కమ్మూరు తదితర గ్రామాల్లో పీర్ల దేవుళ్ల జలధి మహోత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. బెళుగుప్ప మండల కేంద్రంతో పాటు యలగలవంక, బ్రాహ్మణపల్లి, గుండ్లపల్లి, శ్రీరంగాపురం, బూదివర్తి, బెళుగుప్ప, శీర్పి, ఎర్రగుడి, ఆవులెన్న, గంగవరం, దుద్దేకుంట, అంకంపల్లి, రామసాగరం, తగ్గపర్తి, కాలువపల్లి గ్రామాల్లో పీర్ల ఊరేగింపు అనంతరం జలధి నిర్వహించారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, బేలోడు,నేత్రపల్లి, భూపసముద్రం, గోనబావి,గొల్లపల్లి ,రంగసముద్రం,కె.పిదొడ్డి తదితర గ్రామాల్లో పీర్లను జలధికి తరలించారు. కుందుర్పి మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో జలధి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. అలాగే తెనగల్లు, అప్పిలేపల్లి, నిజవల్లి తదితర గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు పూర్తయ్యాయి. కణేకల్లులో కాలభాయి పీర్లదేవుని ఉత్సవం వైభవంగా నిర్వహించారు.



కళ్యాణదుర్గం: పీర్లను జలధికి తీసుకెళ్తున్న దృశ్యం



కళ్యాణదుర్గం: బందోబస్తు పర్యవేక్షిస్తున్న పోలీసులు



బెళుగుప్ప: పీర్లను ఎత్తుకుని అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



బెళుగుప్ప: ఎర్రగుడి గ్రామంలో జలధికి తరలుతున్న పీర్లు



కణేకల్లు: కాలభాయి పీర్లదేవుని ఊరేగింపు దృశ్యం

## ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైన వేళ!



కమలపాడులో కోళ్లఫారం నుంచి మెయిన్ రోడ్డు వరకూ పూర్తయిన సీసీ రోడ్డు నిర్మాణం



కమలపాడులో సుంకులమ్మ కట్ట వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామంలో ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారమైంది. గ్రామంలో కోళ్లఫారం నుంచి ప్రాథమిక పాఠశాల, సుంకులమ్మ కట్ట, పాత పోస్టా ఫీసు వరకూ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండేది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. పాటు పలు కాలనీల్లో కూడా రోడ్లు లేక గ్రామస్తులు అవస్థలు పడేవారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్ ‌ఛార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కొద్ది రోజులక్రితం గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల ప్రత్యేక కృషి ఫలితంగా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. కోళ్లఫారం నుంచి ప్రాథమిక పాఠశాల, సుంకులమ్మ కట్ట,పాత పోస్టాఫీసు వరకూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అలాగే గ్రామంలోని కురుబ కాలనీలో కూడా సీసీ రోడ్డు పనులు పూర్తిచేశారు. సీసీ రోడ్డు పనులు పూర్తికావడంతో ఎంతో సౌకర్యవంతంగా ఉందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### వలంటీర్ కుటుంబానికి అండగా ఉంటాం

ఉరవకొండ: వజ్రకరూరు మండలం పీసీపీ కొత్తకోటకు చెందిన వలంటీరు బెస్త లింగమూర్తి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శనివారం రాత్రి వలంటీరు లింగమూర్తి ఉరవకొండ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ఉన్న వలంటీరు మృతదేహాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించి, మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా మాజీ ఎమ్మెల్యే విశ్వ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని వారు తెలిపారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెడ్పీ మాజీ సభ్యులు తిప్పయ్య, వడ్డే ఆంజినేయులు, వజ్రకరూరు జేసీఎస్ కన్వీనర్ రాచనగౌడ్, నాయకులు పెద్దిరెడ్డి, సామానాయక్, ఎంఎల్ఓ తేజేశ్వర్‌రెడ్డి, వీపీపీ తండా సర్పంచ్ శివాజీనాయక్ పాల్గొన్నారు.

# విత్తనసాగులో అన్నదాతలు



గుమ్మఘట్ట: పూలకుంట గ్రామ సమీపంలో వేరుశనగ విత్తుతున్న రైతు

గుమ్మఘట్ట: ఇటీవల కురిసిన వర్షాలకు నేల పదును కావడంతో అన్నదాతలు విత్తన సాగులో తలమునకలవుతున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్ మండలాల వ్యాప్తంగా 41,844 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటికే 30,156 హెక్టార్లలో వివిధ పంటలను అన్నదాతలు సాగు చేసినట్లు వ్యవసాయ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 20,828 హెక్టార్లలో వేరుశనగ, 4,031 హెక్టార్లలో పత్తి, 1,549 హెక్టార్లలో ఆముదం, 1,590 హెక్టార్లలో మొక్కజొన్న, 1,271 హెక్టార్లలో కంది, 887 ఎకరాలో రాగి, జొన్న, కొర్ర, పంటలు సాగు చేశారు. నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని రసాయనిక ఎరువులు ఆయా గ్రామాల్లో ఆర్బీకే కేంద్రాల్లో లభ్యం కావడంతో అన్నదాతలు ఆసక్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

**కంది, ఆముదంపై ఆసక్తి**

కూడేరు: ఇటీవల కురిసిన జడివానకు మండలంలోని బ్రాహ్మణపల్లి, కమ్మూరు, గొటుకూరు, పి.నారాయణపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు ట్రాక్టర్‌తో కంది, ఆముదం విత్తనం విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మండల వ్యాప్తంగా వేరుశనగ సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. కానీ పదునైన వర్షం కురవకపోవడంతో రైతులు వేరుశనగ విత్తనం సాగు చేయలేకపోయారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.



కూడేరు: బ్రాహ్మణపల్లి వద్ద ట్రాక్టర్‌తో కంది విత్తుతున్న దృశ్యం

# బీర సాగు.. భలే బాగు!

గుమ్మఘట్ట: సాధారణ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు అధునాతన పంటలపై దృష్టి సారిస్తూ నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. కూరగాయల పంటలు సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 350 ఎకరాల్లో బీర పంటలను రైతులు సాగుచేశారు. బీర సాగుతో అధిక లాభాలు గడించవచ్చునని రైతులు నిరూపిస్తున్నారు. మూడు నెలల కాల వ్యవధిలో చేతికి వచ్చే పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట చేతికి వచ్చిన తరువాత బెంగళూరు, హైదరాబాదు మార్కెట్‌లకు తరలిస్తు లాభాలను ఆర్జిస్తున్నారు. కాగా బీర పంట సాగుకు ఎకరాకు విత్తనం నుంచి పందిరి వేయడానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చు వస్తుంది. నాణ్యమైన విత్తనాలు, కట్టెలు, వైరు, గన్నీదారం,కూలీల ఖర్చుల కోసం పెట్టుబడుల రూపంలో వెచ్చించాల్సి ఉంటుంది. పంట కాలం మూడునెలలు. 41 రోజుల తరువాత పంట కటింగ్‌కు వస్తుంది.



గౌనికుంట గ్రామ సమీపంలో సాగుచేసిన బీరకాయల పంట

### ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం



బీరకాయలు నాటిన 41 రోజుల తరువాత కటింగ్‌కు వస్తుంది. పందిరిలాగా వేయడానికి రూ.70 వేల వరకూ ఖర్చు వస్తుంది. కిలో బీరకాయలు రూ.25 నుంచి రూ.30 వరకూ విక్రయిస్తున్నాం. ఎకరాకు 100 క్వింటాలు వరకు దిగుబడి వస్తుంది. చీడపీడల బెడద నుంచి కాపాడుకుంటే పెట్టుబడి ఖర్చులు పోను ఎకరాకు రూ. 1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకూ ఆదాయం వస్తుంది.

– గోవింద, రైతు, గౌనికుంట

### బీరసాగుతో ఆదాయం

బీరకాయల సాగు తక్కువ ఖర్చుతో కూడుకున్న పని. పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ. పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. రోజూ పంటపై దృష్టి పెట్టాలి. మూడు రోజులకోసారి పంటను కత్తిరించాల్సి వుంటుంది. బీరకాయల సాగు చేస్తున్న రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు పాటించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మౌనిక, హార్టికల్చర్ అధికారిణి, రాయదుర్గం.

### 'పరిహారం అందజేయాలి'

కుందుర్పి: చిరుతల దాడుల్లో రెండేళ్ల కాలంగా మృతి చెందిన మూగజీవాలకు పరిహారం అందజేయాలని ఆదివారం బాధిత రైతులు జంబుగుంపల అటవీబీట్ అధికారి పరమేశ్వరప్పకు వినతిపత్రం అందజేశారు.ఏడాది కాలంగా జంబుగుంపల, ఎనుములదొడ్డి, కుందుర్పి తదితర పంచాయతీల్లో 16 పశువులు, 14 గొర్రెలు, 12 మేకలు చిరుతల దాడుల్లో మృతిచెందాయన్నారు. బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ అడవుల్లో మూగజీవాలు చిరుతల దాడుల్లో మృతి చెందితే ఎలాంటి పరిహారం రాదన్నారు. పంట పొలాలు, గ్రామాల పరిసర ప్రాంతాల్లో చిరుతలు దాడి చేసి చంపిన పశువులకు త్వరలో ప్రభుత్వం పరిహారం అందజేయనుందని ఆయన తెలిపారు.

### సంతల ఆదాయం రూ.2.61లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుల ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.61 లలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందుల శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,32,235 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,28,840 మేర వసూలు అయినట్లు తెలిపారు.